

**సోమశిలలో 8.01 టీఎంసీలు**

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 8.013 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 2456 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.73,520 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.6,585 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.6,782 |
| సవర (8 గ్రాములు) | రూ.54,256 |

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
35.0 /29.5

గాలిలో తేమ 64 శాతంగా మంగళవారం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

## డీసీపల్లిలో 513 పొగాకు బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 513 బేళ్లను మంగళవారం విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 598 బేళ్లు రాగా, వీటిలో 513 బేళ్లను విక్రయించామని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని పేర్కొన్నారు. వేలంలో 62,874 కిలోల పొగాకును విక్రయించగా, రూ.1,69,79,201 వ్యాపారం జరిగిందని చెప్పారు. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.331.. కనిష్ట ధర రూ.204.. సగటు ధర రూ.270.05గా నమోదైందని వివరించారు. వేలానికి 21 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

**కిలో పొగాకు గరిష్ట ధర రూ.330**

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.330 లభించింది. సాధారణ క్లస్టర్‌కు చెందిన రైతులు 603 బేళ్లను తీసుకురాగా, 522 బేళ్లను కొనుగోలు చేశారు. 81 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడారు. కనిష్ట ధర రూ.205.. సరాసరి రూ.277.52 లభించిందన్నారు. వేలానికి 13 కంపెనీలు హాజరయ్యాయని తెలిపారు.

## మాతాశిశు మరణాలు సంభవించకూడదు



మాట్లాడుతున్న పెంచలయ్య

ఇందుకూరుపేట: జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా చూడాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గర్భిణులను 12 వారాల్లో గుర్తించడం, చెకప్ ఎక్కువ సంఖ్యలో జరిగేలా చూడాలని కోరారు. హైరిస్క్ గర్భిణుల కేసులను గుర్తించడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, సీజనల్ వ్యాధులు, అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై చర్చించారు. సేఫ్ డెలివరీ క్యాలెండర్ మేరకు జూన్‌లో ప్రసవించే గర్భిణులతో ఫోన్లో మాట్లాడారు. వైద్య శాఖ సిబ్బంది అందించే సేవలను ఆరా తీశారు. హెచ్‌ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ రావు, సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పొణకా కనకమ్మ, రామిరెడ్డికి నివాళి



నెల్లూరు(బృందావనం): స్వాతంత్య్ర సమర యోధులు పొణకా కనకమ్మ, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి జయంతి వేడుకలను పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి నిర్వాహకుడు సురేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత వీరి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. విజ్ఞాన సమితి ముద్రించనున్న దువ్వూరి రామిరెడ్డి రచనలకు రూ.రెండు లక్షల ఆర్థిక సాయాన్ని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అందజేశారని చెప్పారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రచయిత్రి డాక్టర్ చంద్రలత, కుట్టి విద్యాసంస్థల డైరెక్టర్ లతీఫ్‌కుట్టి, వర్ధమాన సమాజ కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, రచయిత్రి జయప్రద, డాక్టర్ సీతా సారంగపాణి, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు బలరామయ్యానాయుడు, సాహితీవేత్త దేవళ్ల పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## 14న జాబ్ మేళా

నెల్లూరు(బృందావనం): నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాను శుక్రవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు కోస్టల్ పవర్ కేర్ ఇంజినీర్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సురెన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ, యాక్ట్ ఫైబర్‌నెట్ కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. ఎస్సెస్సీ, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ విద్యార్హతలు కలిగి 18 నుంచి 32 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు.

# వేటకు వేళాయె..!

**సన్నద్ధమవుతున్న సాగర పుత్రులు**

- రెండు నెలల విరామం తర్వాత తీరంలో సందడి
- వేట నిషేధ పరిహారంతో ఉదారంగా ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

మత్స్యకార గ్రామాల్లో సందడి నెలకొంది. రెండు నెలల విరామం తర్వాత మత్స్యకారులు సాగరంపై వేటకు సిద్ధమవుతున్నారు. మత్స్య సంపద పునరుత్పత్తి కాలంగా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు వేట నిషేధం ఉంది. మరో మూడు రోజుల్లో వేటకు విరామం ముగియనుండటంతో సాగర పుత్రులు వేటకు సర్వసన్నద్ధమవుతున్నారు. వేట నిషేధ సమయంలో పరిహారం పేరిట గత ఐదేళ్లుగా మత్స్యకారులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉదారంగా ఆదుకుంది. ఈ ఏడాది వేట నిషేధం మరో మూడు రోజుల్లో ముగియనుంది. తాజా ప్రభుత్వంలో అందరికి పరిహారంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



వలలను సిద్ధం చేసుకుంటూ..

బిట్రగుంట: వేట నిషేధ కాలం మరో మూడు రోజుల్లో ముగియనుంది. దీంతో మత్స్యకారులు వేటకు సన్నద్ధం కావడంతో తీరం వెంబడి సందడి నెలకొంది. రెండు నెలలుగా తీరంలో భద్రపర్చిన వలలు, పడవలను సిద్ధం చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 12 మండలాల్లో 169 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. తీరం వెంబడి ఉన్న 98 గ్రామాల్లో సుమారు 1.5 లక్షల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. ఇందులో దాదాపు 41 వేల మంది చేపల వేటనే జీవనంగా మార్చుకున్నారు. ఏటా దాదాపు 65 వేల టన్నుల మత్స్య సంపదను సముద్రం నుంచి సేకరిస్తున్నారు. మెజార్టీ మత్స్యకార కుటుంబాలు కడలినే నమ్ముకొని బతుకు పోరాటాన్ని సాగిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు మూడు లక్షలకు పైగా మత్స్యకార జనాభా ఉంది. వీరిలో లక్ష మందికి పైగా మెరుగైన జీవనోపాధి నిమిత్తం చెన్నై, నాగపట్నం, రామేశ్వరం, కడలూరు, తూత్తుకుడి తదితర ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. మిగిలిన రెండు లక్షల మంది మత్స్యకారులు జిల్లా తీరంలోనే వివిధ మార్గాల ద్వారా జీవనం సాగిస్తున్నారు.

**వేట సాగేదిలా..**

సముద్రంలోకి దాదాపు ఐదు కిలోమీటర్లు వెళ్లి వలలు వేసి మత్స్య సంపదను సేకరించి ఉదయం 8 గంటలకు తీరానికి చేరుకుంటారు. మెకనైజ్డ్ బోట్లు ఉన్న మత్స్యకారులు మాత్రం సముద్రంలోకి వెళ్లి వారం.. పది రోజుల పాటు అక్కడే ఉండి మత్స్య సంపదను సేకరించి తీరానికి చేరుస్తారు. వేట సమయంలో మత్స్య సంపదను సేకరిస్తారు. మహిళలు వాటిలో ప్రత్యేకించిన చేపలను తీసి ఆరబెట్టి, ఎండు చేపల రూపంలో విక్రయిస్తుంటారు.



బోటును ఒడ్డుకు తీసుకొస్తున్న మత్స్యకారులు



వలల పరిశీలనలో నిమగ్నం

**ఐదేళ్లు పరిహారం చెల్లింపు**

మత్స్య సంపద పునరుత్పత్తి కాలం 61 రోజుల పాటు వేట నిషేధంతో వారి ఉపాధి కోసం ఒక్కో కుటుంబానికి రూ.పది వేల చొప్పున పరిహారాన్ని గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసింది. గడిచిన ఐదేళ్లుగా ముందుగా ప్రకటించిన విధంగానే పరిహారాన్ని అందజేస్తూ వచ్చింది. విభజిత నెల్లూరు జిల్లాలోని తీర ప్రాంతంలో సుమారు 15 వేల కుటుంబాలకు పైగా పరిహారాన్ని అందజేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకు రూ.నాలుగు వేల నగదు, అదీ కూడా రెండేళ్లకోసారి కొందరికి మాత్రమే అందజేయడంతో మత్స్యకార కుటుంబాలు ఆకలితో అలమటించే వారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంగపుత్రుల కన్నీళ్లు తుడిచింది. సబ్సిడీపై డీజిల్, బీమా రెండింతలకు పెంచడం, బోట్ల రిజిస్ట్రేషన్ తదితర సంక్షేమాలతో మత్స్యకార కుటుంబాలు సంతోషం వ్యక్తం చేశాయి. తాజాగా ప్రభుత్వం మారింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ తరహాలోనే మత్స్యకారులను ఆదరిస్తుందా.. లేక కొర్రీలతో కోతలు పెడుతుందాననే అంశాన్ని వేచి చూడాల్సి ఉంది.

## ‘అపోలో’లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని అపోలో సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రిలో 70 ఏళ్ల వృద్ధుడి గుండెకు కాలువాల్వు ద్వారా శస్త్రచికిత్స చేసి ప్రాణాలను కాపాడామని ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను సీనియర్ కార్డియాలజిస్ట్ చిర్రా భక్తవత్సలరెడ్డి వెల్లడించారు. ప్రకాశం జిల్లా శింగరాయకొండకు చెందిన నాగేశ్వరరావు దగ్గు, ఆయాసం, ఛాతి నొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ప్రయోజనం లభించలేదని చెప్పారు. ఈ క్రమంలో తమ ఆస్పత్రికి వారం క్రితం వచ్చారని, పరీక్షలు చేయగా ఆక్సిజన్ 80 శాతానికి పడిపోయిందని, హార్ట్‌రేట్ 130గా నమోదైందని తెలిపారు. క్రియాటిన్ 2.3గా ఉందన్నారు. గుండెలో ఉండే కవాటం ఐదు సెంటీమీటర్లకు గానూ 0.7 మేర ఉండి బలహీనపడిందన్నారు. ఈ స్థితిలో అధునాతన పద్ధతిలో సరికొత్త విధానం ద్వారా ఆపరేషన్ చేశామని చెప్పారు. రోగి గుండెను పేస్‌మేకర్ ద్వారా నాలుగు సెకన్లు ఆపి కాలు నుంచి వాల్వ్‌ను నాలుగు సెకండ్లలో అమర్చామని తెలిపారు. రోగి ప్రస్తుతం కోలుకుంటున్నారని చెప్పారు. ఎమర్జెన్సీ, ఐసీయూ హెడ్ శ్రీనివాస్, కార్డియోథొరాసిక్ సర్జన్లు విజ్ఞచరణ్, మధు, కార్డియాలజిస్టులు షర్మిలి, నాగభూషణం, యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ శిక్షణకు ‘కేఎన్నార్’ విద్యార్థులు



నెల్లూరు (టౌన్): ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ ఎన్‌సీసీ శిక్షణ శిబిరానికి కేఎన్నార్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గుంటూరు జిల్లాలోని కేఎల్ యూనివర్సిటీలో జాతీయ స్థాయిలో శిక్షణను ఈ నెల 15 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. నేవల్ ఎన్‌సీసీలో కేఎన్నార్ స్కూల్ నుంచి సాదిక్ ఫిర్దోస్, కాకాణి భావ్య ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్, ఎన్‌సీసీ అధికారి నరేంద్రబాబు అభినందించారు.

## పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పద్మ అవార్డులకు సంబంధించిన ప్రతిపాదనల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సెట్నెల్ సీఈఓ వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించనున్న పద్మ అవార్డుల కోసం వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాలో సామాజిక సేవా రంగాల్లో అత్యుత్తమ సేవలను అందించిన యువజన సంఘాల సభ్యులు తమ పూర్తి వివరాలను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్లో నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు, డాక్యుమెంట్లను జూలై 15లోపు ఏకే నగర్‌లోని సెట్నెల్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

## విద్యార్థికి ఆర్థిక సాయం

తడ: అనారోగ్యంతో ఇటీవల ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద ఉన్న విద్యార్థికి రూ.25 వేల సాయాన్ని యూటీఎఫ్, తడ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మాంబట్టు పంచాయతీ ఎస్‌ఎంకండ్రిగకు చెందిన యనమల చరణ్‌కు అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు. చరణ్ తండ్రి సైతం ఇటీవల అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకున్నారు. కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు తలా కొంత సేకరించి అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు బాబు, మండలాధ్యక్షుడు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మకు పూజలు

ఓజిలి: ఓజిలిలో పోలేరమ్మ అమ్మవారికి గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. పొంగళ్లను అమ్మవారిని నైవేద్యాలుగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత గ్రామస్తులు అంబళ్లు పోశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

## వైద్యశాఖలో ఉద్యోగాల పేరిట మోసం

- రూ.16 లక్షల వసూలు

నెల్లూరు(అర్బన్): కాంట్రాక్ట్ ఉద్యోగాలను ఇప్పిస్తానని నమ్మబలికి నిరుద్యోగుల నుంచి రూ.16 లక్షలు వసూలు చేసిన వైనం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో వెలుగు చూసింది. వివరాలు.. నాయుడుపేట డివిజన్ దొరవారిసత్రం మండలంలోని గొట్టిప్రోలు పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సు పనిచేస్తున్నారు. అదే మండలంలో వైద్యశాఖలో పనిచేస్తున్న ఓ సూపర్‌వైజర్ తాను డీఎంహెచ్‌ఓకు బాగా పరిచయమైన వ్యక్తినని సదరు స్టాఫ్ నర్సును నమ్మించారు. రెండు బ్యాక్‌లాగ్ స్టాఫ్ నర్సుల పోస్టులతో పాటు ఎఫ్‌ఎన్‌ఓ, ఎమ్మెన్వో, ఆఫీస్ బేరర్ లాంటి పోస్టులను ఇప్పిస్తానని చెప్పారు. ఒక్కో పోస్టుకు ఒక్కో రేటును నిర్ణయించి డబ్బులు చెల్లించాలని కోరారు. ఈ క్రమంలో తన మిత్రులు, తెలిసిన వారికి ఉద్యోగాలు వస్తాయని సదరు స్టాఫ్‌నర్సు భావించారు. ఈ తరుణంలో నర్సు ద్వారా రూ.16 లక్షలను సదరు సూపర్‌వైజర్‌కు కొందరు చెల్లించారు. నెలలు గడుస్తున్నా, ఉద్యోగాలను ఇప్పించకపోగా.. తీసుకున్న డబ్బులను వెనక్కివ్వకపోడంతో సూపర్‌వైజర్‌ను నర్సు నిలదీశారు.

**నెపం మరొకరిపైకి..**

నర్సు గొడవ చేయడంతో తప్పించుకునేందుకు సూపర్‌వైజర్ యత్నించారు. నగరంలోని వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ మహేశ్‌కు నగదును ఇచ్చానంటూ తెలిపారు. దీంతో సదరు నర్సు నేరుగా జూనియర్ అసిస్టెంట్‌కు ఫోన్ చేసి ఆరాతీయగా, తనకెలాంటి సంబంధం లేదని.. ఇందులోకి తనను లాగొద్దని కోరారు. సంభాషణను ఫోన్లో రికార్డు చేశారు. దీంతో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు ఆమె ఫిర్యాదు చేశారు. డబ్బులు వసూలు చేసిన సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు తగు చర్యలు చేపడతామని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

## కోవూరుపల్లిలో కోలాహలం



పొంగళ్లు పెడుతున్న భక్తులు

- పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో పొంగళ్ల సమర్పణ



ప్రత్యేకాలంకారంలో పోలేరమ్మ

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లిలో గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్లు పొంగించే కార్యక్రమాన్ని గ్రామస్తులు వేడుకగా మంగళవారం నిర్వహించారు. పోలేరమ్మ చెల్లెలైన కనకదుర్గమ్మకు గ్రామ పొలిమేరలో పొంగళ్లు పొంగించి నైవేద్యాలను ఆదివారం సమర్పించారు. మలి ఘట్టంగా పొంగళ్లు పొంగించి నైవేద్యాలను సమర్పించారు. పోలేరమ్మ ఆలయంలో పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడివీధి బావి కూడలి వద్ద ఉన్న వేపచెట్టును పోలేరమ్మగా భావించి చద్దిని గణాచారి ఆధ్వర్యంలో సమర్పించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో తయారు చేసిన నైవేద్యాలతో మంగళవాయిద్యాలు, తప్పెట్లు, బాణాసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా పోలేరమ్మ గుడికి చేరుకున్నారు. తదుపరి సామూహికంగా పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడే వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. కోవూరుపల్లితో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.



విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల కటౌట్లు

## ఏపీఈఏపీసెట్ ఫలితాల విడుదల

- జిల్లా విద్యార్థులకు పలు ర్యాంక్‌లు

నెల్లూరు (టౌన్): ఏపీఈఏపీ సెట్ ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించిన పరీక్షలను గత నెల 16 నుంచి 23 వరకు నిర్వహించారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా దాదాపు 16 వేల మంది విద్యార్థులు హాజరుకాగా, 85 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

**జిల్లా విద్యార్థుల సత్తా**

ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సాధించారు.

- ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ విభాగంలో దగదర్తి మండలం వెలుపోడుకు చెందిన కడప చైతన్య 54, నగరానికి చెందిన బిరుదురాజు బద్రినాథ్‌వర్మ 88, కందుకూరుకు చెందిన దార్ల భరత్‌చంద్ర 242, కందుకూరులోని యర్రగుంటపాళేనికి చెందిన తూమాటి నవీన్‌చంద్ర 275, నగరంలోని నవాబుపేటకు చెందిన అమృతలూరు వెంకటనిఖిత్‌బాబు 313, కావలికి చెందిన కొండూరు ప్రిసిల్లాసాత్విక 315, మాగుంటలేవుట్‌కు చెందిన కంచంరెడ్డి మహేంద్రరెడ్డి 319, కొండాయపాళేనికి చెందిన రాయవరపు రాకేష్ 417, వెంకటాచలం మండలం పూడిపర్తికి చెందిన చెందిన బొజిగి శ్రీనాథ్ 460, బాలాజీనగర్‌కు చెందిన జితేంద్ర 492వ ర్యాంక్‌ను సాధించారు.
- అగ్రికల్చర్ విభాగంలో దర్గామిట్టకు చెందిన కోయగురు వెంకటసాత్విక్ 17, నూకనపల్లికి చెందిన సాయిగణేష్ 44, చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో నివాసం ఉంటున్న ఫణి శ్రీశాంక్ 70, కొండాయపాళేనికి చెందిన చెంచుఈశ్వర్‌ప్రసాద్ 77, వావిలేటిపాడుకు చెందిన లాస్యప్రియ 106, యనమలవారి వీధికి చెందిన బ్రాహ్మిణి 174, జెడ్పీ కాలనీకి చెందిన మోజ్జరెడ్డి 177, దామరమడుగుకు చెందిన తాస్మియా 194, వింజమూరుకు చెందిన జాహ్నవి 224, బాలాజీనగర్‌కు చెందిన లక్ష్మీవైష్ణవి 263వ ర్యాంక్‌ను సాధించారు.

**డాక్టరవ్వడమే ధ్యేయం**



తండ్రి ఫణికృష్ణ, తల్లి సౌజన్య వైద్యులు. ఏపీఈఏపీ సెట్‌లో 70.. నీట్‌లో 705 ర్యాంక్‌ను సాధించా. భవిష్యత్తులో వైద్యుడిగా స్థిరపడాలనేదే లక్ష్యం.

– శశాంక్

**డాక్టర్‌గా రాణిస్తా**



కలువాయిలో నివాసం ఉంటున్నా. తండ్రి శ్రీనివాసులురెడ్డి, తల్లి శిరీషా కూరగాయల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఏపీఈఏపీ సెట్‌లో 44.. నీట్‌లో 715వ ర్యాంక్‌ను సాధించా. భవిష్యత్తులో డాక్టర్‌గా రాణిస్తా.

– సాయిగణేష్

## ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి





మాట్లాడుతున్న మంజుల

నెల్లూరు(బృందావనం): వృత్తిపై నిబద్ధతను పెంచడంతో పాటు ఉపాధ్యాయుల సంక్షేమానికి ఏపీటీఎఫ్ కృషి చేస్తోందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల పేర్కొన్నారు. నగరంలోని పురమందిరంలో మంగళవారం నిర్వహించిన ఫెడరేషన్ జిల్లా సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్‌రావు మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేసే నేతలు, కార్యకర్తలను ఏపీటీఎఫ్ గుర్తిస్తోందని చెప్పారు. విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు తోడ్పాటునందించాలని కోరారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఏపీటీఎఫ్ – 1938కు చెందిన 200 మంది కార్యకర్తలు, నేతలు సభ్యత్వాన్ని స్వీకరించారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దశరథరామయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నేతలు సురేంద్ర, మోహన్‌దాసు, జనార్దన్‌రావు, సుబహాన్, ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు జిలానీ, జిల్లా ప్రధాన కార్యదర్శి హజరత్, సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు



రుషికేష్‌ను కాపాడి తీసుకొస్తున్న పోలీసులు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో సముద్రపు నీటిలో చిక్కుకున్న యువకుడిని మెరైన్ పోలీసులు కాపాడారు. స్థానికుల కథనం మేరకు.. కోవూరు మండలం వేగూరు మజరా సీతారామపురానికి చెందిన పల్లి రుషికేష్ బంధుమిత్రులతో కలిసి మంగళవారం మైపాడు బీచ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో అందరూ కలిసి సముద్రంలో స్నానం చేస్తుండగా రుషికేష్ అలల వల్ల కొట్టుకుపోయాడు. తోటి వారు గమనించి కేకలు వేడయంతో అక్కడ ఉన్న మెరైన్ హెడ్‌కానిస్టేబుల్ మోహన్, హోంగార్డ్ కార్తీక్ ఆ యువకుడిని కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అందందించి వైద్యశాలకు తరలించారు. పర్యాటకులు పోలీసులను అభినందించారు.

### కండలేరులో 6.496 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.496 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### రెండు పూరిళ్లు దగ్ధం



కాలిపోయిన ఇళ్లు

విడవలూరు: మండలంలోని ఊటుకూరు పంచాయతీ బడంకాయగుంట ఎస్టీ కాలనీలో మంగళవారం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఎందేటి పోలయ్య, రావూరు ప్రసాద్ ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. పోలయ్య ఇంట్లో కుటుంబసభ్యులు వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న ప్రసాద్ పూరింటికి కూడా మంటలు అంటుకున్నాయి. పోలయ్య ఇల్లు పూర్తిగా కాలిపోగా రూ.1.50 లక్షలు, ప్రసాద్ ఇల్లు పాక్షికంగా కాలిపోగా రూ.50 వేల నష్టం వాటిల్లింది. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే స్థోమత తమకు లేదని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

### శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 78,064 మంది స్వామివారిని దర్శించుకోగా 33,869 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.7 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు రెండు గంటల్లో దర్శనం అవుతోంది.

### నిమ్మ ధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.80 |
| సన్నవి | : రూ.50 |
| పండ్లు | : రూ.35 |



### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 156 |
| లేయర్ (లైవ్) | : 120 |
| బ్రాయిలర్ చికెన్ | : 274 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 304 |
| లేయర్ చికెన్ | : 204 |

# జీవాల పెంపకంతో లాభాలు

గతానికి భిన్నంగా దశాబ్ద కాలం నుంచి నెల్లూరు జోడిపి జాతి గొర్రెల పెంపకంపై అనేకమంది ఆసక్తి చూపుతున్నారు. అత్యధికంగా మాంసం ఉత్పత్తి, జిల్లా వాతావరణానికి అనుకూలంగా త్వరగా పెరిగే ఈ పొట్టేళ్లకు రాష్ట్రంలోనే అధిక డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మిలటరీ క్యాంపులకు కూడా సరఫరా చేస్తుంటారు.

- నెల్లూరు 'జోడిపి' జాతికి అధిక డిమాండ్
- ఒక్కో పొట్టేలు బరువు 45 నుంచి 50 కిలోలు
- కిలో మాంసం ధర రూ.900కుపైగా..



నెల్లూరు జోడిపి జాతి జీవాలు

ఆత్మకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో ఆత్మకూరు, పొదలకూరు, బాలాయపల్లి, వెంకటాచలం, ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, వరికుంటపాడు, జలదంకి, సీతారామపురం, అనంతసాగరం, కలువాయి, చేజర్ల, దుత్తలూరు, రాపూరు తదితర అనేక మండలాల్లో గొర్రెల పెంపకం అధికంగా ఉంది. అధికారిక లెక్కల ప్రకారం జోడిపి జాతి జీవాలు జిల్లాలో సుమారు 11 లక్షలకుపైగా పెంచుతున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

**జిల్లాలో ఇలా..**

దశాబ్దన్నర క్రితం వరకు పల్లా జాతి గొర్రెల పెంపకం జిల్లాలో ఎక్కువగా ఉండేది. క్రమేపీ అది తగ్గి జోడిపి జాతి పెంపకం ఎక్కువైంది. ఇందులో క్వాలిటీ ఉన్న మాంసం లభించడంతోపాటు ఎలాంటి రోగాలకు గురికాకుండా త్వరగా పెరిగి బరువు వచ్చే జాతిగా గుర్తింపు రావడంతో పెంపకం పట్ల అనేకమంది ఆసక్తి చూపుతున్నారు. పలు జిల్లాల్లో ప్రభుత్వం సబ్సిడీ కింద జీవాలను అధికారులు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పెంపకందారులు జోడిపి జాతినే ఎంపిక చేసుకుంటున్నారు. సకాలంలో వ్యాక్సిన్లు వేయిస్తుంటే ఈ జాతి గొర్రెలకు ఎలాంటి రోగాలు సంక్రమించవని వైద్యులు చెబుతున్నారు.



**తక్కువ కాలంలో వేగంగా..**

మూడు నెలల వయసుండి 8 నుంచి 10 కేజీల బరువుండే గొర్రె పిల్లలను ఎంచుకుని పెంపకం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లా వాతావరణానికి ఈ జాతి వేగంగా పెరుగుతాయి. నెలకు ఒకటిన్నర కేజీ నుంచి రెండు కేజీల వరకు ఈ పిల్లలు పెరుగుతాయని పశువైద్యాధికారులు తెలిపారు. ప్రత్యేక దాణా లాంటివి వేసి పెంచితే మూడు నుంచి నాలుగు కేజీల చొప్పున నెలకు పెరిగే అవకాశం ఉందంటున్నారు.

**ఎంపిక**

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరు గొర్రెల సంతలో జోడిపి జాతిని ఎంచుకుని పెంపకానికి తీసుకెళ్లడం కొన్ని సంవత్సరాలుగా జరుగుతోంది. ఎంపిక చేసుకునే క్రమంలో ఎలాంటి రోగాలు లేకుండా చూసుకోవాలి. సకాలంలో టీకాలు వేయించాలి. అనేక మంది పెంపకందారులు అనుభవం ఉన్న పాడిరైతులను సంతకు తీసుకెళ్లి ఎంపిక చేసుకుంటున్నారు. పశువైద్యశాలలు అందుబాటులో ఉండడం వీరికి కలిసొచ్చే అంశం. ఉమ్మడి జిల్లాలో 85 పశువైద్య కేంద్రాలు, 15 ఏడీ కేంద్రాలతోపాటు ప్రతి సచివాలయం పరిధిలో ఆర్‌బీకేల్లో సిబ్బంది ఉండడంతో నాణ్యమైన పొట్టేళ్లు మార్కెట్‌కు వస్తున్నాయి. సకాలంలో జీవాలకు వ్యాక్సిన్లను పశువైద్య సిబ్బంది వేయిస్తుండడంతో పెంపకందారులకు శ్రమ తగ్గింది.

### లాభాలిలా..

గ్రామాల్లో వరి కోతలకు ముందుగా పెసర, పిల్లిపెసర, అలసంద తదితర పశుగ్రాసాలను చల్లి వరి కోతల అనంతరం జీవాలను పెంచడం ఆనవాయితీగా వస్తోంది. రైతులు మూడు నెలల వయసు గల పిల్లలను ఎంపిక చేసుకుని పశుగ్రాసాలు సాగు చేసే పొలాల్లో మేపుతారు. సుమారు ఐదు నుంచి ఆరునెలల పాటు మేసే జోడిపి రకం బలంగా పెరిగి అమ్మకానికి సిద్ధమవుతాయి. ఒక్కో మందలో 20 నుంచి 40 జీవాల వరకు పెంచడం జరుగుతోంది. ఇతర ప్రాంతాల వ్యాపారులు బలంగా పెరిగిన జీవాలను వీలైనంత మేరకు పొలాల వద్దే కొనుగోలు చేయడం సహజం. ఒక్కో పొట్టేలును సుమారుగా రూ.4 వేలకు కొనుగోలు చేసినా ఆరు నెలల అనంతరం అవి సుమారు 40 నుంచి 45 కేజీల వరకు పెరుగుతాయి. వీటి మాంసం రూ.900 నుంచి రూ.1,000కు కొనుగోలు చేస్తుండడంతో ఈ జాతికి అధిక డిమాండ్ ఉంది. దీంతో పెంపకందారులు లాభాలు చవిచూస్తున్నారు.

### పెంపకం అధికంగా ఉంది



ప్రత్యేకంగా నెల్లూరు జిల్లాలో జోడిపి జాతి జీవాల పెంపకం అధికంగా ఉంది. గతంలో ఉన్న పల్లా రకం కంటే ఈ రకానికి డిమాండ్ అధికంగా ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. రోగాలు తక్కువ, వేగంగా పెరగడమే కారణం. నెల్లూరు బ్రౌన్ రకం కొన్ని ప్రాంతాల్లో పెంచుతున్నారు. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో గొర్రెల పెంపకందారులు నెల్లూరుకు వచ్చి ఈ జాతి జీవాలను కొనుగోలు చేస్తున్నారు. రైతులకు లాభాలు చేకూర్చే ఈ జాతి జీవాలు పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం.

– డాక్టర్ జయచంద్ర, ఏడీ, ఆత్మకూరు డివిజన్ పశువైద్యశాల

### కుటుంబ పోషణ నిమిత్తం పనికి వెళ్లి..

- విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి



విద్యుత్ షాక్‌కు గురై పడిపోయిన అశోక్

అనుమసముద్రంపేట: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఏఎస్‌పేట మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఏఎస్‌పేటకు చెందిన శ్రీనివాసులు మంగమ్మల కుమారుడు ఎస్.అశోక్ (21) ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవుల నేపథ్యంలో కుటుంబ పోషణ నిమిత్తం అతను పనులకు వెళ్లేవాడు. మంగళవారం ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్ సమీపంలో నూతన భవన నిర్మాణంలో భాగంగా సెంట్రింగ్ పని చేస్తున్నాడు. ఈ సమయంలో 11 కేవీ విద్యుత్ వైర్లకు సెంట్రింగ్ కమ్ములు తగలడంతో అశోక్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటి పనివాళ్లు 108 అంబులెన్స్‌లో అతడిని ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ రెడ్డి తెలిపారు.

# ఒక్క ఫోన్‌కాల్‌తో నగదు భద్రం

- సవాల్‌గా సైబర్ నేరాలు
- డబ్బు పోయిన వెంటనే స్పందిస్తే మేలు
- 1930 నంబర్‌కు ఫోన్ చేస్తే మోసాలకు చెక్

- నెల్లూరు నగరానికి చెందిన శ్రీనివాసులు సైబర్ నేరగాళ్ల మాయలో పడ్డాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.2.55 లక్షలు పోగొట్టుకున్నాడు.
- కావలికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేందుకు ప్రయత్నించగా సైబర్ నేరగాళ్లు ఆమె బ్యాంకు ఖాతాల్లోని రూ.లక్ష నగదును కాజేశారు.
- ఆత్మకూరుకు చెందిన యువకుని సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అందులోని లింక్‌ను క్లిక్ చేయగా అతని అకౌంట్‌లో నుంచి రూ.75 వేలను కాజేశారు. ఇలాంటి ఘటనల్లో బాధితులు తక్షణమే అప్రమత్తమై బ్యాంకు సిబ్బందికే కాకుండా సైబర్ సెల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయడంతో కొంతమేర నష్టాన్ని పూడ్చుకోగలిగారు.



నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలోని నగదు దోచేస్తే సైబర్ సెల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయడంతో నగదు భద్రంగా ఉండే అవకాశం ఉంది. ఈ ఫోన్ నంబర్ 24 గంటలూ పనిచేస్తుంది. అందులోని సిబ్బంది బ్యాంకులు, యూపీఐ వ్యాలెట్లకు సంబంధించిన ప్రతినిధులతో ఉత్తరప్రత్యుత్తరాలు నిరంతరం నడుపుతుంటారు. సైబర్ మోసగాళ్ల బారిన పడి నగదు పోగొట్టుకున్న బాధితులు తక్షణమే 1930కు ఫోన్ చేయాలి. హెల్ప్‌లైన్ సిబ్బంది బాధితుని వివరాలతోపాటు ఏ ఖాతా నుంచి నగదు పోయిందో తెలుసుకుని ఆ బ్యాంకు నోడల్ అధికారికి వెంటనే సమాచారం అందజేస్తారు. బాధితుని ఖాతాను పరిశీలించి అందులోని సొమ్ము ఏ ఖాతాకు బదిలీ జరిగిందో గుర్తించి సంబంధిత బ్యాంకు అధికారికి తెలియజేస్తారు. ఎవరైతే మోసగించి తమ ఖాతాలో డబ్బులు వేసుకున్నారో వారి ఖాతాను బ్యాంకు అధికారులు ఫ్రీజ్ చేస్తారు. ఆ బ్యాంకు ఖాతాలోని లావాదేవీలన్నీ బ్లాక్ చేస్తారు. దీంతో నిందితులు ఆ నగదును డ్రా చేసే అవకాశం లేకుండా పోతుంది. బాధితుడికి నగదు తిరిగి వచ్చేందుకు ఈజీగా ఉంటుంది. మరో వైపు ఫ్రీజ్ చేసిన ఖాతా ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించే వీలు కలుగుతుంది. ఒకవేళ అకౌంట్ ఫ్రీజ్ చేసే లోపలే నిందితులు నగదును విత్‌డ్రాచేస్తే నగదు బదిలీ అయిన విధానం, బ్యాంకులిచ్చే సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులను పట్టుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ వెంటనే వెంటనే జరగాలంటే బాధితుడు మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేయడం ద్వారానే సాధ్యమవుతుందని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

### బాధితులు చేయాల్సింది

- సైబర్ నేరగాళ్ల బారిన పడి నగదు పోగొట్టుకున్న వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 నంబర్‌కు ఫోన్ చేయాలి.
- కాల్ సెంటర్ సిబ్బంది అడిగిన వివరాలను తెలియజేయాలి. డబ్బులు పోగొట్టుకున్న సమయంలో సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లను స్క్రీన్ షాట్ తీసి కాల్ సెంటర్‌కు పంపాలి.
- సంబంధిత బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి క్రెడిట్, డెబిట్ కార్డులు, లావాదేవీలను బ్లాక్ చేయించాలి.
- జిల్లా సైబర్ క్రైమ్ సెల్‌కు ఫిర్యాదు చేయాలి
- ఆన్‌లైన్‌లో సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్‌కు ఫిర్యాదు చేయొచ్చు.

# బ్లడ్ క్యాంపులకు సహకరించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 14వ తేదీన స్వచ్ఛంద సంస్థలు, బ్లడ్‌బ్యాంకుల యాజమాన్యాలు ఎక్కువ సంఖ్యలో రక్తాన్ని సేకరించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. నెల్లూరులోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన అన్ని బ్లడ్ బ్యాంకుల ప్రతినిధులు, బీసీ వెల్ఫేర్, సెట్నెల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ రోగులకు, క్షతగాత్రులకు అవసరమైన మేరకు రక్తనిల్వలు సిద్ధంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. స్వచ్ఛంద రక్తదానంపై ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, సెట్నెల్ అధికారులు పాల్గొన్నారు.

# తీవ్రంగా శ్రమించి..



ట్యాంకర్‌ను బయటకు తీస్తున్న క్రేన్లు

సంగం: సంగం కొండ మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతలో బోల్తా పడిన సిమెంట్ ట్యాంకర్‌ను బయటకు తీసేందుకు మంగళవారం భారీ క్రేన్లను వినియోగించారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు వైపు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ మోటార్‌బైక్‌ను తప్పించబోయి గేదెలతోపాటు ప్రమాదవశాత్తు కారు వెనుక భాగంలో ఢీకొట్టి రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఒక గేదెకు తీవ్ర గాయాలు కాగా మరొకటి మృతిచెందింది. కాగా గుంతలో పడిన ట్యాంకర్‌ను మంగళవారం బయటకు తీశారు. ఇందుకోసం ఆరు క్రేన్‌లను వినియోగించారు. సుమారు ఐదు గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది. జనం పెద్దఎత్తున విచ్చేసి ఈ ప్రక్రియను తిలకించారు.

# వేద విజ్ఞానానికి నిలయం వేదిక్ వర్సిటీ

- యూజీ, పీజీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి



తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ పరిపూర్ణ వేద విజ్ఞానానికి నిలయమని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి తెలిపారు. వేదాల్లోని సారాంశాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు వర్సిటీ పనిచేస్తోందన్నారు. యావత్ భారతదేశంలో వేద విద్యను సంపూర్ణంగా అందిస్తున్న ఏకైక విశ్వవిద్యాలయం ఎస్వీ వేదిక్ వర్సిటీనే అని పేర్కొన్నారు. 2024 – 25 అకడమిక్ అడ్మిషన్ల ప్రక్రియ నేపథ్యంలో వర్సిటీలోని కోర్సుల వివరాలు, అర్హతలు, ఉపాధి అవకాశాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

**యూజీ, పీజీ అడ్మిషన్లకు 15న చివరి గడువు**

వర్సిటీలో ప్రధానంగా 21 విభాగాల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇందులో యూజీ (శాస్త్ర) కోర్సులకు సంబంధించి వేద విభాగంలో రుగ్వేద, క్రిష్ణ యజుర్వేద, శుక్ల యజుర్వేద, సామవేద, అధర్వణ వేదం లోనూ, ఆగమశాస్త్రం విభాగంలో వైఖానస ఆగమం, పంచరాత్రగామం, శైవాగమం లోనూ, పౌరోహిత్యం విభాగంలో అశ్వాలయన, అపస్తంభ, పరస్కర, వైఖానస పౌరోత్యంలోనూ, వేదభాష్యంలోని ఐదు, కల్ప, మీమాంస విభాగాల్లో అడ్మిషన్లు చేపడుతున్నాం. ఇందులో ఒక్కో విభాగంలో 15 సీట్లు భర్తీ చేస్తున్నాం. అదేవిధంగా పీజీ (ఆచార్య) కోర్సులకు సంబంధించి వేదాల్లో ఐదు, ఆగమశాస్త్రంలో మూడు విభాగాల్లోనూ, పౌరోహిత్యంలో నాలుగు, వేదభాష్యంలో ఐదు విభాగాల్లో, మీమాంస, కల్పన వంటి పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానించాం. పీజీ కోర్సులలో ఒక్కో విభాగానికి 10 సీట్లు భర్తీ చేయనున్నాం. దీంతోపాటు ఏదేని డిగ్రీ కలిగి సంస్కృతంపై పట్టు ఉన్నవారి కోసం డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టాం. ఇందులో టెంపుల్ మేనేజ్‌మెంట్, జోతిష్యం, వాస్తు, మ్యాన్‌స్క్రిప్ట్ కోర్సులను అందిస్తున్నాం. వీటితోపాటుగా ఇంటర్ విద్య పూర్తి చేసి సంస్కృతం పరిజ్ఞానం ఉన్న వారి కోసం ఏడు విభాగాలలో సర్టిఫికెట్ కోర్సును అందిస్తున్నాం.

**ఉపాధి కల్పనే లక్ష్యంగా..**

దేశంలోనే ఏకైక వేదిక్ వర్సిటీగా పిలువబడే టీటీడీ సంస్థ వేదిక్ వర్సిటీలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు వంద శాతం ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్నారు. ప్రధానంగా వర్సిటీలో వేద, ఆగమ, పౌరోహిత్యంలో పలు కోర్సులను అందిస్తున్నాం. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగంలో మరింత పట్టు సాధించేందుకు నిపుణులైన అధ్యాపకులచే బోధన అందిస్తున్నాం. వర్సిటీలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. దేశానికే తలమానికమైన అయోధ్యలో నిర్మించిన రామమందిర్‌లో వర్సిటీ నుంచి ఇద్దరు విద్యార్థులు పనిచేస్తుండడం గర్వంగా ఉంది. అదేవిధంగా దేశ, విదేశాల్లోని పలు ఆలయాల్లో పండితులుగాను, వేద అధ్యాపకులుగాను, ఆగమ శాస్త్ర నిపుణులుగా రాణిస్తున్నారు. వర్సిటీలో కోర్సు పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి స్థిరపడ్డారు.

**ప్రత్యేక విభాగం**

వేదిక్ వర్సిటీలో ప్రాచీన తాళపత్ర గ్రంథాల సంరక్షణ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం. తాళపత్ర గ్రంథాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సిబ్బంది పనిచేస్తున్నారు. ఇప్పటికే పలు జాతీయ సంస్థలతో ఈ ప్రక్రియపై ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. వేదాల్లోని జ్ఞానాన్ని ప్రపంచానికి అందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించి పరిశోధనలు చేస్తున్నాం. ప్రాచీన తాళపత్రాలు ఏ ప్రాంతం నుంచి వచ్చినా డిజిటలైజేషన్ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నాం. దీంతో పాటు వేదిక్ నాలెడ్జ్‌ను అందించేందుకు ప్రముఖ జాతీయ విద్యా సంస్థలైన ఐఐటీ, ఐఐఎం, ఐజర్‌తో పలు అంశాలపైన కలసి పనిచేస్తున్నాం.